క్లుప్తంగా

వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ



తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని సీతానగరం జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, వికాస తరంగిణి సంయుక్త ఆధ్వర్యంలో వరద బాధితులకు గురువారం దుప్పట్లు, బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి మంగళ శాసనాలతో విజయవాడ, వించిపేట శ్రీ దాసాంజనేయ దేవస్థానం నందు, పరిసర ప్రాంతాల్లో కృష్ణానది వరత బాధితులకు సుమారు 400 మందికి వస్త్రాలు, దుప్పట్లు, బియ్యం అందజేశామని తెలిపారు.

దేవదాయశాఖ ఈవోగా జెక్కా బాధ్యతల స్వీకారం



ఫిరంగిపురం: దేవదాయ ధర్మదాయ శాఖ మండల అధికారిగా జెక్కా శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఈవోగా పనిచేసిన గాదె రామిరెడ్డి బదిలీపై పల్నాడు జిల్లా రెంటచింతలకు వెళ్లారు. దుగ్గిరాల మండలం ఈమనిలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు బదిలీపై ఫిరంగిపురం వచ్చారు. కాగా బాధ్యతలు స్వీకరించిన ఈవోకు మండల బ్రాహ్మణ అర్చక సంఘ నాయకులు కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఈఓ చెప్పారు. సంఘ నాయకులు దీవి వరప్రసన్నమూర్తి, రావూరి పూర్ణచంద్రశాస్త్రి, పి శ్రీనివాసాచార్యులు ఉన్నారు.

నేడు ప్రజా దర్బార్

తాడేపల్లిరూరల్ : మంగళగిరి నియోజకవర్గం, రాష్ట్ర ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కోసం ఐటీ, విద్యా, మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ శుక్రవారం ఉదయం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు ఉండవల్లిలోని మంత్రి నారా లోకేష్ నివాసం నందు నిర్వహించనున్నామని, ఉదయం 7 గంటల లోపు వచ్చిన వారికి మాత్రమే ప్రవేశం ఉంటుందని మంత్రి నారాలో కేష్ కార్యాలయ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

30న ఉచిత మెగా వైద్య శిబిరం

తాడేపల్లిరూరల్ : మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం కొలనుకొండ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగర సురేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో డయాబెటిక్ వైద్యులు డాక్టర్ నిఖిల్, గుండె జబ్బుల వైద్యులు డాక్టర్ వంశీకృష్ణ కామన, జనరల్ వైద్యులు డాక్టర్ నిఖిల్, కీళ్ల–ఎముకల వైద్యులు డాక్టర్ కడియాల జయకృష్ణ, చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ రవికుమార్, స్త్రీల వైద్యులు డాక్టర్ ఎం.పరిమళ జయంతి, దంత వైద్యులు డాక్టర్ కె. శ్రీకర్, చర్మ వైద్యులు డాక్టర్ అర్చన మాధురి, మూత్ర పిండాల వైద్యులు డాక్టర్ జి. శశిధర్, క్యాన్సర్ వైద్యులు డాక్టర్ వినోద్, లక్ష్మి కంటి పరీక్షా కేంద్రం కంటి వైద్యులు, ఆయుర్వేద వైద్యులు డాక్టర్ రవిబాబు, ఫిజియోథెరపి వైద్యులు డాక్టర్కృష్ణలీల తదితరులు తమ వైద్య సేవలను అందించనున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ అధ్యక్షుడు వంగర సురేష్ కుమార్ తెలిపారు.

విద్యార్థినికి ఉపాధ్యాయుల సాయం



తాడికొండ: మండలంలోని పొన్నెకల్లు ప్రభుత్వ పాఠశాలలో చదివి ఎంబీబీఎస్ సీటు సాధించిన పేద విద్యార్థిని మృదులతకు పాఠశాల ఉపాధ్యాయ బృందం తమవంతు చేయూతనందించింది. ప్రధానోపాధ్యాయని జరీనా బేగం మృదులతను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయ బృందం మృదులతను ఘనంగా సత్కరించి, రూ.20,500 ఆర్థిక సాయం అందజేశారు.

హుండీ కానుకల లెక్కింపు

పట్నంబజారు: దేవదాయ ధర్మదాయశాఖ పరిధిలోని లాలాపేట వేంకటేశ్వరస్వామి, నాజ్సెంటర్ ఆంజనేయస్వామి, జగన్నాథస్వామి ఆలయాల్లోని హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం గురువారం జరిగింది. లాలాపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయాల కార్యనిర్వాహణాధికారి డి.శ్రీనివాస్, పాలకమండలి ఆధ్వర్యంలో లెక్కింపు నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి రూ.4,25,559, నాజ్సెంటర్ ఆంజనేయస్వామి దేవస్థానానికి రూ.3,01,469, జగన్నాథస్వామి ఆలయానికి రూ 8,464 కలిపి మొత్తం రూ 7,35,492 ఆదాయం గ్రూపు ఆలయాలకు సమకూరినట్లు తెలిపారు.

వంద రోజుల్లో రూ.100కే మద్యం



సమావేశంలో ప్రసంగిస్తున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

- కూటమి ప్రభుత్వంలో 10శాతం పెరిగిన మద్యం దుకాణాలు
- ప్రజా సమస్యలను విస్మరించి, మద్యానికి ప్రాధాన్యం
- ప్రభుత్వ తీరును ఖండించిన ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

తాడేపల్లిరూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న నూతన మద్యం పాలసీ దేనికోసమని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి ప్రశ్నించారు. గురువారం కొలనుకొండలోని మహిళా సంఘాల ఐక్య వేదిక కార్యాలయంలో నూతన మద్యం పాలసీపై చర్చావేదిక నిర్వహించారు. ప్రముఖ న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్యం విక్రయాలు, వ్యాపారం ఎలా చేయాలి అనే దానిపై ప్రభుత్వం దృష్టి పెట్టింది తప్ప నియంత్రణ మీద కాదని విమర్శించారు. పాఠశాలలు, కళాశాలలు దేవాలయాల వద్ద మద్యం షాపులు ఉండరాదని, అధికారికంగా 12 గంటలే విక్రయాలు జరగాలి, మద్యాన్ని ఆదాయ వనరుగా ప్రభుత్వం భావిస్తే మహిళల ఉద్యమానికి మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. గతంలో 2,936 మద్యం షాపులు ఉంటే ఇప్పుడు 3,700 షాపులకు అనుమతి ఇచ్చారని చెప్పారు. బార్లు అన్నీ కలుపుకుంటే 4 వేలకు దాటి పోతున్నాయన్నారు. 72 వేల అక్రమ బెల్ట్ షాపులు రాష్ట్రంలో ఉన్నాయని వీటిని మూసివేస్తారా లేదా 12 గంటలు విక్రయిస్తామని చెబుతున్న ప్రభుత్వం షిఫ్టులు పెడుతుందా అని ప్రశ్నించారు. వంద రోజుల కూటమి ప్రభుత్వ పరిపాలనలో 100 రూపాయల్లో మద్యం అందిస్తున్నారని, ఇది ప్రజలు కోరుకునేది కాదని, నిత్యావసర రేట్లు పెరిగిపోయాయని, మద్యం నూతన పాలసీలో ఉన్న షాపుల కంటే 10 శాతం పెంచారని అన్నారు. సారా ఉద్యమాన్ని ఆంధ్రప్రదేశ్ మర్చి పోలేదని, మహిళలు రోడ్ల మీదకు వస్తారు జాగ్రత్త అని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ డబ్ల్యూ నేత దుర్గాభవాని, సుంకర పద్మశ్రీ, పీఓడబ్ల్యూ పద్మ, భూమిక కలెక్టివ్ నుంచి బిందు, నాస్తిక సమాజం నుంచి అరుణ్, దుర్గాంబ, అమలశ్రీ, రత్న, భారతి, ప్రజా సంఘాల నాయకులు తదితరు పాల్గొన్నారు.

డిమాండ్స్ డే కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రవి

తాడేపల్లిరూరల్ : అఖిల భారత డిమాండ్స్ డే ను జయప్రదం చేయాలని సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షుడు ఎం.రవి పిలుపునిచ్చారు. ఎంటీఎంసీ పరిధిలోని ఎర్రబాలెంలో అఖిల భారత డిమాండ్స్ డే కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి, కరపత్రాలను రవి ఆవిష్కరించారు. ఈ నెల 30న గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి మహా ప్రదర్శన నిర్వహించనున్నామని తెలిపారు. అనంతరం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో కార్మికులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. నాన్ పర్మినెంట్ కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి దేశ వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో జరిగే నిరసన ర్యాలీలు, ధర్నాలు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు టి.బాబు, ఒ.రామారావు, కె.కోటేశ్వరి, టి.ఆదిలక్ష్మి, ఎం.పార్వతి, శివకోటి, అంకరావు పాల్గొన్నారు.

విస్తృతంగా ర్యాపిడ్ రెస్పాన్స్ టీం పర్యటన



మహానాడు ప్రాంతంలో వివరాలు సేకరిస్తున్న ర్యాపిడ్ రెస్పాన్స్ టీం

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి పట్టణ పరిధిలో వరద నీరు వచ్చిన ప్రాంతం, వర్షపునీరు, మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో గురువారం ర్యాపిడ్ రెస్పాన్స్ టీం ఫర్ ఫీవర్ అవుట్ బ్రేక్స్ బృందం విస్తృతంగా పర్యటించింది. ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రొఫెసర్స్ డాక్టర్ బి.హేమ, డాక్టర్ ఎల్ గీత కల్యాణ్ మాట్లాడుతూ ఏడీ డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కె. విజయలక్ష్మి ఆదేశాల మేరకు తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం, మహానాడు కట్ట, నులకపేట, ఆర్ఎంఎస్ కాలనీల్లో సర్వే నిర్వహించామన్నారు. ఈ సర్వేలో జ్వరాలు, ఇతర వ్యాధులు గుర్తించి, అందుకు గల కారణాలు తెలుసుకున్నట్లు చెప్పారు. లార్వా ఉన్న ప్రాంతాల్లో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో కలసి నివారణా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. టీఎంకే సుబ్బరాయనం, జిల్లా మలేరియా అధికారి వి.వరప్రసాద్, డాక్టర్ జి.సుగుణ రాజు, డాక్టర్ కె.సాయి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులందరికీ పరిహారం చెల్లించాలి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్



వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

తాడికొండ: ఇటీవల రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులందరికీ వెంటనే పరిహారం చెల్లించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తాడికొండ తహసీల్దారు కార్యాలయంలో రైతు సంఘం నాయకులతో కలిసి నిరసన తెలియజేశారు. ఆర్ఐ నల్లాకు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ వరదల కారణంగా పంట పొలాల్లో భారీగా నీరు చేరి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. పంట నష్టపోయిన పొలాలను వ్యవసాయాధికారులు పరిశీలించి, అర్హులందరినీ గుర్తించి పరిహారం అందేలా చూడాలన్నారు. కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వరి, మినుము పంటలకు మాత్రమే పంటనష్టం అంచనాలు వేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పత్తి పొలాల్లో ఊడా నీరు నిలిచి మొక్కలు ఉరకెత్తిన కారణంగా రైతులు నష్టపోయారని వారికి కూడా పరిహారం అందేలా చూడాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు రూ.20 వేలను వెంటనే ఖాతాలలో జమచేయాలని డిమాండ్ చేశారు. పంటల భీమాను తక్షణమే అమలు చేయాలని, దాని ద్వారా రైతాంగ సమస్యలు కొంతమేరకు తగ్గుతాయన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డు ఇవ్వాలని, బ్యాంకు రుణాలను భూ యజమానులతో సంబంధం లేకుండా మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు కనగాల పూర్ణచంద్రరావు, మండల నాయకులు చింతల భాస్కరరావు, ఇమ్మడి రామారావు, బాణావత్ భద్రయ్య, జోజి, జొన్నల కోటిరెడ్డి, పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లాం గ్రీన్ సిటీ విల్లాస్‌లో చోరీ

రూ. 2 లక్షల విలువైన విద్యుత్ సామగ్రి అపహరణ



చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ జోజి

లాం(తాడికొండ): మండలంలోని లాం గ్రామ పరిధిలోని గ్రీన్ సిటీ విల్లాస్‌లో రూ.2 లక్షల విలువ చేసే విద్యుత్ సామగ్రి చోరీకి గురైనట్లు తాడికొండ సీఐ కె.వాసు తెలిపారు. లాం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఎదుట నిర్మాణంలో ఉన్న గ్రీన్‌సిటీ విల్లాస్‌లోని నిర్మాణంలో ఉన్న భవనాలకు విద్యుత్ పనులు చేసేందుకు తెచ్చిన వైర్లు, ఇతర సామాన్లు ఓ గదిలో పెట్టి షట్టర్ వేశారు. అయితే 23న విల్లాస్ పరిశీలనకు వచ్చిన బిల్డర్ షట్టర్ తలుపులు తెరిచి ఉన్నట్లు గమనించడంతో తెరిచి చూడగా రూ.2 లక్షలు విలువ చేసే సామగ్రి చోరీకి గురయ్యిందని గుర్తించారు. విచారించగా ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో 25 సాయంత్రం తాడికొండ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు సీఐ కె.వాసు తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ జోజి పరిశీలించి దర్యాప్తును ప్రారంభించినట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులకు అభినందన



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్, పీఈటీ సిబ్బంది

తాడికొండ: స్కూల్ గేమ్స్‌లో తమ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ నెమలికంటి మరియదాసు తెలిపారు. గురువారం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ లో అండర్- 17, 14 విభాగాల్లో తమ పాఠశాల నుంచి 15 మంది విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. అందులో 11 మంది ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను, వారికి ఉత్తమ శిక్షణ అందించిన పీఈటీలు సతీష్, ప్రశాంత్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి.శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఐలమ్మ జయంతి



తాడేపల్లిరూరల్ : ప్రాతూరులో భూ పోరాట యోధురాలు, వీరనారి చిట్యాల ఐలమ్మ 129వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రజక అభ్యుదయ గుంటూరు జిల్లా అధ్యక్షుడు దావులూరు శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, రాష్ట్ర అధ్యక్షుడు వల్లూరు మధుసూదన్‌రావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. చిట్యాల ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఐలమ్మ జయంతి కార్యక్రమాలు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించామన్నారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తితో, రాష్ట్ర వ్యాప్తంగా రజకులు ఎదుర్కొంటున్నసమస్యలపై, హక్కుల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా అధ్యక్షుడు నీలాపు సురేంద్రబాబు, వేమవరపు మల్లేశ్వరరావు, కార్యనిర్వహణ కార్యదర్శి పడమట ప్రసాద్, రజక అభ్యుదయ సంఘం విజయవాడ కార్యదర్శి అల్లూరి శేషగిరి, నూతక్కి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పిచ్చి తీగలు తొలగించరూ...



ఫిరంగిపురం: మండలంలోని వేమవరం గ్రామంలోని బ్రహ్మంగారి గుడి సమీపంలోని విద్యుత్ స్తంభానికి పిచ్చి తీగలు అల్లుకపోయాయి. దీంతో వర్షాలు పడే సమయంలో నిప్పు రవ్వలు పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పిల్లలు స్తంభానికి సమీపంలో ఆడుకుంటున్న సమయంలో ప్రమాదాలు సంభవించక ముందే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తీగలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల పరిధిలో అండర్-14, 17 బాల, బాలికల అథ్లెటిక్స్ పోటీలను గురువారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో నిర్వహించారు. పరుగు పందెంతో పాటు షాట్‌పుట్, డిస్కస్‌త్రో, హైజంప్, 100 మీటర్ల హర్డిల్స్ పోటీలను నిర్వహించినట్లు కళాశాల వ్యాయామ అధ్యాపకుడు ఆర్.శివాజీ తెలిపారు. పోటీలను పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి, డిగ్రీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎ.భానుమురళీధర్ ప్రారంభించారు. ఆయా పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన క్రీడాకారులు జిల్లా స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారని శివాజీ పేర్కొన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రాంతీయ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ మొహమ్మద్ పాల్గొన్నారు.

సమాజమే జాషువా కవిత్వానికి ఇతివృత్తం

నగరంపాలెం: సమాజంలో బాధితుడి నుంచి అగ్రగణ్యుడిగా ఎదిగిన మహాకవి గుర్రం జాషువా అని దళిత బహుజన ఫ్రంట్ అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్ పేర్కొన్నారు. మహాకవి గుర్రం జాషువా జయంతి ఉత్సవాల్లో భాగంగా జాషువా కళాపీఠం ఆధ్వర్యంలో గురువారం నగరంపాలెంలోని మహాకవి గుర్రం జాషువా విగ్రహం వద్ద జాషువా సాహిత్యం – జీవితం అంశంపై సభ నిర్వహించారు. సభకు తెనాలి ప్రభుత్వ సహాయక న్యాయవాది సుద్దపల్లి సుకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కొరివి వినయకుమార్ మాట్లాడుతూ మహాకవి గుర్రం జాషువా ఆకలి, అంటరానితనం అనుభవించారని, ఆయన దిగువస్థాయి వ్యక్తి దృక్పథం నుంచి సమాజాన్ని దర్శించి కవిత్వాన్ని రాశారని అన్నారు. గుర్రం జాషువా జీవితాన్నే సాహిత్యంగా మలిచారని అన్నారు. కాపు నాయకులు మాదా రాధ, లైబ్రేరియన్ సొపాటి రమేష్, మహిళా న్యాయవాది పరిశపోగు అపర్ణా దేవి, నాయకులు చంద్రపాల్, జెట్టి బాబురావు, గుర్రాల వెంకటేశ్వర్లు, ప్రముఖ హార్మోనిస్ట్ సలీంబాబు, హైకోర్టు న్యాయవాది గద్దం ఎలీషాను నిర్వాహకులు సన్మానించారు. సహాయ కార్యదర్శి కందుల ప్రసాదరావు, దాసరి జాన్‌బాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయడమే లక్ష్యం

- కలిసికట్టుగా విజయానికి కృషి చేయాలి
- మంగళగిరి పార్టీ ఇన్‌చార్జి వేమారెడ్డి



సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

మంగళగిరి: నియోజకవర్గంలో తిరిగి వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నియోజకవర్గ ఆ పార్టీ ఇన్‌చార్జి దొంతిరెడ్డి (శంకరరెడ్డి)వేమారెడ్డి పిలుపునిచ్చారు. ఇన్‌చార్జిగా నియమితులైన వేమారెడ్డిని గురువారం పట్టణంలోని జాతీయ రహదారి వెంట ఉన్న ఆయన కార్యాలయంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి అభినందనలు తెలియజేశారు. వేమారెడ్డి మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా సమన్వయంతో పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. నియోజవర్గంలో ఏ ఎన్నిక జరిగినా వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయాలన్నారు. అధికారంలో ఉన్న టీడీపీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలన్నారు. అధికార పార్టీ అరాచకాలకు భయపడకుండా ధైర్యంగా ముందుకెళ్లి వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలన్నారు. మంగళగిరి, తాడేపల్లి పట్టణ కన్వీనర్లు ఆకురాతి రాజేష్, బుర్రముక్క వేణుగోపాలరెడ్డి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మునగాల భాగ్యలక్ష్మి, మహిళా విభాగం కన్వీనర్ సంకె సునీత, నాయకులు ఎండీ ఫిరోజ్ , దొంతిరెడ్డి వేమారెడ్డి, నాలి వెంకటకృష్ణ, కత్తిక రాఘవరావు, కలకోటి బోయేజు, దర్శి రమేష్, మాచర్ల అబ్బు, యేమినేని ధనుంజయరావు, రాచకొండ వెంకటేశ్వరరావు, వడ్డేశ్వరపు రజనీకాంత్ పాల్గొన్నారు.

స్వచ్ఛ మంగళగిరే లక్ష్యం



ర్యాలీలో పాల్గొన్న కమిషనర్ ఆలీంబాషా



చెత్తను ట్రాక్టర్‌లోకి తరలిస్తున్న సిబ్బంది

మంగళగిరి: స్వచ్ఛ మంగళగిరే లక్ష్యంగా స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కమిషనర్ ఆలీం బాషా తెలిపారు. గురువారం పట్టణంలో పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. పలుచోట్ల చెత్తను తొలగించి ట్రాక్టర్ల ద్వారా తరలించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వార్డులో నిరంతరం పారిశుద్ధ్య కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కోసం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం పట్టణంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా తడి చెత్త పొడి చెత్తను వేర్వేరుగా పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



పరీక్ష చేస్తున్న వైద్యురాలు శ్వేత

ఫిరంగిపురం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తగా ఉండాలని ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్వేత అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయం -2 పరిధిలోని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్లో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. 243 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులపై ప్రజలకు డాక్టర్ శ్వేత అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. దోమలు బారిన పడకుండా దోమ తెరలు వాడుకోవాలన్నారు. మురుగు కాలువల్లో నీరు పారుదల సక్రమంగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరీ, ఎంఎల్‌హెచ్‌పీ స్పందన, ఏఎన్ఎం మాబు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ శాఖతో ఎస్‌ఆర్‌ఎం ఒప్పందం



ఆర్‌ఎండ్‌బీ శాఖతో ఎంవోయూ కుదుర్చుకున్న ఎస్‌ఆర్‌ఎం ప్రతినిధులు

మంగళగిరి: రాష్ట్ర రోడ్లు భవనాల శాఖకు సమగ్ర సహకారాన్ని అందించేందుకు మండలంలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు యూనివర్సిటీలో గురువారం ఆర్‌ఎండ్‌బీ శాఖ ప్రతినిధులు, ఎస్‌ఆర్‌ఎం ప్రతినిధులు ఎంవోయూ కుదుర్చుకున్నారు. ప్రభుత్వం చేపట్టే నాణ్యమైన రోడ్లు నిర్మాణం కొత్త టెక్నాలజీ అభివృద్ధి వర్క్‌షాప్‌ల నిర్వహణ వంటి కీలకమైన అంశాలలో అవసరమైన సహకారాన్ని అందించేందుకు యూనివర్సిటీ సివిల్ ఇంజినీరింగ్ విభాగం అంగీకరించింది. ఈ మేరకు ఆర్‌ఎండ్‌బీ ఇంజినీర్ ఇన్ చీఫ్ నయీముల్లా, స్టేట్ హై వే చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస రెడ్డి ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డీన్ డాక్టర్ రంజిత్ థాపా, సివిల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ రవితేజ, డాక్టర్ ఉమా మహేశ్వరరావు, డాక్టర్ భగత్‌సింగ్, డాక్టర్ హరీష్, డాక్టర్ ప్రణవ్ పాల్గొన్నారు.

గుంటూరు రైల్వే డివిజన్‌ను పరిశుభ్రంగా ఉంచాలి

డీఆర్ఎం కార్యాలయంలో మెగా శ్రమదాన్



శ్రమదాన్‌లో పాల్గొన్న డీఆర్ఎం ఎం.రామకృష్ణ, సంబంధిత విభాగాధిపతులు, సిబ్బంది

లక్ష్మీపురం: స్వభావ స్వచ్ఛత సంస్కార్ స్వచ్ఛత అనే కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ భారత్ మిషన్ ప్రారంభించి 10వ వార్షికోత్సవం సందర్భంగా గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో పారిశుద్ధ్య సేవల మెగా శ్రమదాన్‌ను నిర్వహించడం జరిగిందని గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్ఎం ఎం.రామకృష్ణ అన్నారు. స్థానిక పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయంలో గురువారం మెగ శ్రమదాన్ కార్యక్రమాన్ని డీఆర్ఎం ప్రారంభించి సిబ్బందితో కలిసి స్వయంగా పాల్గొని కార్యాలయ ప్రాంగణం అంతా శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఉన్న ప్రతి రైల్వేస్టేషన్, కార్యాలయ ప్రాంగణాన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని ప్రయాణికులు, సందర్శకులకు ఎలాంటి ఆటంకం కలుగకుండా చూసుకోవాల్సిందిగా సూచించారు. అనంతరం గుంటూరు రైల్వే స్టేషన్‌లో స్టాల్స్‌ను, ప్యాంట్రీ కార్‌లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏడీఆర్ఎం కె.సైమన్, సీపీఎం డి.మనోహర్‌రెడ్డి, సీనియర్ డీఎంఈ ఎం.రవికిరణ్, సీనియర్ డీసీఎం సిహెచ్ ప్రదీప్‌కుమార్, సీనియర్ డీపీఓ షహబాజ్ హనూర్, సీనియర్ డీఎస్‌టీఈ రత్నాకర్, సీనియర్ డీఈఈ జి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.